ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 10 ఏప్రిల్ 2024





వేడుకగా.. శ్రీక్రోధి

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం
- ప్రముఖులకు, కళాకారులకు ఉగాది పురస్కారాలు

బాపట్ల, ఏప్రిల్ 9: తెలుగువారి నూతన సంవత్సరం శ్రీక్రోధి నామ ఉగాది వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా వేడుకగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేకపూజలు, పంచాంగ శ్రవణాలు పెద్దఎత్తున జరిగాయి. వివిధ కూడళ్లు, సంస్థల కార్యాలయాల్లో కూడా ఉగాది వేడుకలను నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆలయాల్లో వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, విశిష్ట సేవలందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఇళ్లల్లో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలను ధరించి ఇంటి గడపలను మామిడి తోరణాలతో అలంకరించి ఇష్ట దైవాలకు పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా తీసుకున్నారు. ఉగాది సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. నూతన పంచాంగాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఉగాదిని పురస్కరించుకుని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



పండితులను సత్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తదితరులు



చింతాయ పాలెంలో శ్రీసారకాయల అంకమ్మతల్లికి ఉగాది పూజలు నిర్వహిస్తున్న భక్తజన సందోహం

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి : జేసీ

జిల్లా ప్రజలంతా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, విజయాలతో అభివృద్ధి వైపు సాగాలని జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. మంగళ వాయిద్యాలతో దేవదాయశాఖాధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పురస్కారాలతో అర్చకులను జేసీ సత్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ తెలుగునూతన సంవత్సరం ప్రారంభం నుంచే కొత్త లక్ష్యాలు, విజయాల వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, దేవదాయశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్యామల, పర్యవేక్షకుడు రమేష్‌నాయక్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌకగా.. బియ్యం మాత్రమే

చౌక దుకాణాలు.. టీడీపీ హయాంలో మినీ మాల్స్‌లా ఉండేవి. బియ్యం, పంచదార, పామాయిల్, గోధుమ, కందిపప్పులతో పాటు ప్రజలకు అవసరమైన పలు రకాల వస్తువుల విక్రయాలతో కళకళలాడేవి. మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఉప్పు పప్పుల నుంచి సబ్బులు, నూనెలు, గోధుమ పిండి తదితరాలు ఎన్నో అందుబాటులో ఉండేవి. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేక ఇబ్బందిపడే సరుకులను కూడా సబ్సిడీతో చౌక దుకాణాల్లో కార్డు దారులకు ప్రభుత్వం అందించేది. ఇక పండుగల సమయాల్లో ప్రత్యేకంగా సరుకులను చౌక దుకాణాల ద్వారా కానుకల రూపంలో పంపిణీ జరిగేది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత రేషన్ వ్యవస్థను సంస్కరిస్తున్నామంటూ భ్రష్టు పట్టించేశారు. రేషన్ అంటే బియ్యం మాత్రమే అన్నట్లుగా మార్చేసింది. కందిపప్పు, పంచదార అర కొరగానే పంపిణీ చేస్తుంది. మార్కెట్లో అందుబాటులో లే కుండా విపరీతంగా ధరలు పెరిగిపోయి సామాన్యులు విలవిల్లాడుతున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందే కాని ఆయా సరుకులను సబ్సిడీపై అందించాలన్న కనీస ఆలోచన చేయడం లేదు. ఇలా పౌరసరఫరాల వ్యవస్థను పూర్తిగా దిగజార్చడంపై ఎన్ని విమర్శలు వస్తున్నా వైసీపీ పాలకులు పట్టించుకోవడంలేదు.

- రేషన్ సరుకుల్లో కోతలు
- నామమాత్రంగానే సరుకుల పంపిణీ
- పామాయిల్, గోధుమ పూర్తిగా కనుమరుగు
- లబ్ధిదారులపై పెరిగిన నెలవారీ ఆర్థిక భారం
- ఐదేళ్లుగా దిగజారిపోయిన పౌరసరఫరాల వ్యవస్థ

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వచ్చి రేషన్ బియ్యం అందజేస్తాం అంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో పౌరసరఫరాల వ్యవస్థను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. ఐదేళ్ల క్రితం తొలిగా మొబైల్ డిస్పెన్సరీ వాహనాలతో హడావుడి చేసింది. ఆ పేరుతో అప్పటి వరకూ పేదలకు అందే నిత్యావసర సరుకులను వారికి ఇవ్వకుండా చేసిందన్న విమర్శలు వచ్చాయి. అప్పటి వరకూ పేదలకు బియ్యం పంచదారతోపాటు అందుతూ వచ్చిన కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వంటి సరుకులు వారికి అందకుండా పోయాయి. కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ జరుగుతోంది. కందిపప్పు నూటికి 30 కుటుంబాలకు, గోధుమపిండి నూటికి 15 కుటుంబాలకు మాత్రమే అందుతోంది. దీంతో లబ్ధిదారులపై నెలవారీ ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోయింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటి ద్వారా మూడు జిల్లాలో సుమారు 50 లక్షల మందికి రేషన్ సరుకులు అందిస్తారు. ప్రతి నెలా మనిషికి 5 కిలోల బియ్యంతో పాటు, అరకిలో పంచదార, కిలో కందిపప్పు చౌక ధరలకు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం క్రమంగా వాటిని తగ్గిస్తూ వచ్చింది. ఒక్క బియ్యం మినహా మిగిలిన సరుకులకు రకరకాల కారణాలతో కోత విధించారు. 2022 నుంచి పంచదార, కందిపప్పు సరఫరా పడిపోయింది. కందిపప్పు సరఫరా మూడొంతులు తగ్గింది. ఎన్నికలు సమీపించే సమయానికి లబ్ధిదారులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో భాగంగా తిరిగి కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం స్వీకారం చుట్టింది. పండుగ నెలలైన డిసెంబరు, జనవరిలో కూడా కార్డుదారులకు కందిపప్పు అందించలేక అబాసుపాలైంది. కాగా గోధుమ పిండి సరఫరా చేస్తామని హడావుడి చేసిన ప్రభుత్వం అందులోనూ చేతులెత్తేసింది. నూటికి 15 కుటుంబాలకు కూడా గోధుమపిండి సరఫరా చేయలేక గుడ్లు తేలేసింది. అంతగా పౌర సరఫరాల శాఖ పరిస్థితి దిగజారింది. ఒకానొక దశలో నెలల తరబడి అర కిలో పంచదార కూడా సరఫరా చేయలేకపోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

1700 టన్నుల నుంచి 4 టన్నులకు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్డుదారులకు గతంలో 1700 టన్నుల కందిపప్పు సరఫరా జరిగేది. అయితే వైసీపీ ప్రభుత్వం కోత విధించుకుంటూ దానిని 4 టన్నులకు పరిమితం చేసింది. ఆ కందిపప్పును కూడా పౌర సరఫరాల శాఖ ప్రతీ నెలా సరఫరా చేయలేకపోతోంది. ఫలితంగా నూటికి 70 కుటుంబాలకు కందిపప్పు అందకుండానే పోతోంది. 2023కు వచ్చే సరికి పరిస్థితి మరింత దిగజారిపోయింది. జూలైలో 17 లక్షల కిలోలకు ప్రభుత్వం 935 కిలోలు మాత్రమే కందిపప్పును సరఫరా చేసింది. ఆగస్టులో పల్నాడు జిల్లాలోని 6లక్షల 36 వేల కుటుంబాలకు 12 కిలోల కందిపప్పు పంపిణీ చేసింది. దీనినిబట్టి పౌర సరఫరాల వ్యవస్థ ఎంతగా కుదేలైపోయిందో తెలిపోతోంది.

కోతలతో పాటు పెరిగిన ధరలు

వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకూ రేషన్ సరుకుల్లో భారీగా కోత పడింది. టీడీపీ హయాంలో 2018 మార్చి నుంచి ఒక్కో కుటుంబానికి 2 కిలోల కందిపప్పు రూ.40 చొప్పున ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం దానిలో కోత పెట్టి కిలోకి తగ్గించింది. ధరను రూ.40 నుంచి రూ.67కి పెంచింది. అయినప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో కుటుంబానికి కిలో పంచదార రూ.20 చొప్పున అందించేది. దాన్నీ ఈ ప్రభుత్వం అరకిలోకి తగ్గించి రూ.17 వసూలు చేస్తోంది. అంటే కిలోకు రూ.14 పెంచినా అది కూడా అరకొర సరఫరా చేస్తున్నారు. 2018-19లో రాగులు, జొన్నలు, గోధుమపిండి, ఉప్పు తదితరాలను లబ్ధిదారులకు రేషన్ సరుకులతో పాటు పంపిణీ చేశారు. దాంతోపాటు పండుగ సమయాల్లో, నూనె ధరలు అధికంగా ఉన్న సమయంలో పామాయిల్‌ను సబ్సిడీ ద్వారా కిలో రూ.40 పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వంట నూనెల ధరలు మూడంకెల సంఖ్యను చేరినా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం వంట నూనె ఇచ్చిన దాఖలాలు లేవు. పైపెచ్చు ప్రతి ఏటా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు, తోఫాలను పూర్తిగా ఆపేసి చేతులు దులుపుకుంది.


సామాన్యులపై పెరిగిన భారం

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులే ఆధారం. ఆకాశాన్నంటుతున్న సరుకుల ధరలు, అంతంత మాత్రం సంపాదనలో పేదల ఆకలి తీర్చేది ప్రభుత్వం అందించే రేషన్ మాత్రమే. కానీ ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కోలుకోలేనంతగా దెబ్బతీసింది. నూటికి పది మందికి ఒకటి, అరా సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. దీంతో వారంతా బహిరంగ మార్కెట్లో సరుకులను కొనుక్కోవాల్సి వస్తోంది. కందిపప్పు కిలో రూ.160, వంట నూనె కిలో రూ.110, గోధుమపిండి కిలో 70, పంచదార కిలో రూ.45 ఉన్న నేపథ్యంలో అవి రేషన్ షాపుల్లో చౌక ధరలకు లభ్యమైతే వారిపై భారం తగ్గేది. అయితే ఆయా సరుకులు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయని కారణంగా వారు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుక్కోవాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో కుటుంబంపై సగటున నెలకు 500 నుంచి వెయ్యి రూపాయల మేర అదనపు భారం పడుతోంది. ఈ భారం మోయలేక జన సామాన్యం తీవ్ర ఇబ్బందులు పడుతోంది.



వైసీపీ ఉచ్చులో.. వలంటీర్లు

- వారి భవిష్యత్‌తో నేతల చెలగాటం
- ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారాలు
- రెచ్చగొట్టి మూకుమ్మడిగా రాజీనామాలు
- వలంటీర్లపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి





పల్నాడు జిల్లాలో ఇటీవల రాజీనామాలు చేసిన వలంటీర్లు

బాపట్ల, ప్రత్తిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజా ధనం నుంచి గౌరవ వేతనాలు తీసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. ఇది కరెక్ట్ కాదు.. అని ప్రతిపక్ష నాయకులతో పాటు ఎన్నికల సంఘం కూడా చెప్తోంది. అయితే ఇదేమీ పట్టని కొందరు వలంటీర్లు వైసీపీ నాయకులు చెప్పినట్లుగా చేస్తూ వస్తోన్నారు. మొత్తంమీద అధికార పార్టీ నేతల ఉచ్చులో వలంటీర్లు పడిపోతున్నారు. వలంటీర్ల భవిష్యత్‌తో వైసీపీ చెలగాటమాడుతోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. కోడ్ అమలులో భాగంగా ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలకు వైసీపీ రాజకీయ జోక్యాన్ని అంటగడుతుంది. మొన్నటి వరకు కోడ్ ఉల్లంఘించేలా ప్రచారంలో భాగస్వామ్యం చేసి వలంటీర్లు సస్పెన్షన్‌కు గురి కావడానికి పరోక్షంగా వైసీపీ నేతలే కారణమ య్యారన్న ఆరోపణలున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించే వలంటీర్లకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని టీడీపీ నేతలు గతంలోనే చెప్పి ఉన్న సంగతి తెలిసిందే. కానీ కోడ్ అమల్లోకి వచ్చాక కొంతమంది వలంటీర్లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో నిబంధనల ప్రకారం అధి కారులు వారిమీద చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ చర్యలను టీడీపీకి ఆపాదిస్తూ వారిని మరింత రెచ్చగొట్టి ఓట్ల పబ్బం గడుపుకో వాలని వైసీపీ చూస్తోంది. తాజాగా సామాజిక పింఛన్ల పంపిణీలో ఈసీ ఆదేశాలకు వక్రభాష్యం చెబుతూ వలంటీర్లను రెచ్చగొడుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను మసిపూసి మారేడు కాయ చేస్తూ వలం టీర్లను రాజకీయ క్రీడలో పావులుగా వాడుకోవడంపై టీడీపీ మండిపడు తోంది. వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకమనే బోగస్ ప్రచారాన్ని వైసీపీ నేతలు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఈసీ కన్ను వలంటీర్‌ల మీద ఉందని తెలిసినా వారిని లొంగదీసుకుని ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేస్తూ వారి సస్పెన్షన్‌కు కారణమయ్యారు. ఇప్పుడేమో వారిని రాజీ నామాలు చేయమని వైసీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నా రు. వారిని రెచ్చగొట్టి పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారానికి వాడుకునే దుర్మార్గ క్రీడకు వైసీపీ పూనుకుం టోండగా దానిని పసిగట్టలేని పలువురు వారి ఉచ్చులో పడుతున్నారు. ఈ క్రమంలో వారి భవిష్యత్ ఏమైనా పర్వాలేదనే రీతిలో అధికార పార్టీ నేతల వ్యవహార శైలి ఉండడం గమనార్హం. వలంటీర్లలో చాలా మంది డిగ్రీ, పీజీలు చేసిన వారు కూడా ఉన్నారు. నిబం ధనలు అతిక్రమించడంతో ఈసీ ఆదేశాల మేరకు పలువురిపై వేటు పడుతోంది. భవిష్యత్‌లో వారి ఉన్నతికి ఇది శాపంగా పరిణమించే అవ కాశం ఉందనే ఆవేదనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించి వైసీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, గ్రూపులలో సదరు నేతలకు అనుకూలంగా ప్రచారం చేయడం వంటి అంశాలతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 30 మందికిపైగా సస్పెన్షన్‌కు గురయ్యారు. కర్లపాలెం మండల పరిధిలో వైసీపీకి అనుకూ లంగా ప్రచారం చేసినందుకు ఓ మహి ళా వలంటీర్‌పై ప్రభుత్వం గతంలోనే వేటు వేసింది. బల్లికురవ మండల పరిధిలో వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నందుకు మరో ఇద్దరి వలంటీర్లపై చర్య తీసుకున్నారు. ఇవన్నీ పూర్తిగా కోడ్ ఉల్లంఘన కిందకు రావడం వల్లే అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఈ సస్పెన్షన్లకు కారణం టీడీపీయే అంటూ మరి కొంతమంది వలంటీర్లను తమ ఉచ్చులోకి లాగే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. ఇక పెన్షన్లు అందించే విషయంలో ఈసీ నిర్ణయానికి వక్రభాష్యం చెబుతూ వలంటీర్ల చేత రాజీనామాలు చేసే విధంగా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి రాజకీయ క్రీడలోకి వారిని లాగుతున్నారు. వలంటీర్ల గౌరవవేత నం పెంచడంతో పాటు వారి ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండబోదని ఇప్పటికే పలు సందర్భాల్లో టీడీపీ ప్రకటించి ఉంది. వలంటీర్ల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని అధికారుల ముందు వారిని దోషులుగా నిలబెడుతున్నారంటున్నారు.

నాడు హీరోలు.. నేడు జీరోలు

నిన్న మొన్నటి వరకు వలంటీర్లను అధికార పార్టీ హీరోలుగా చిత్రీకరించింది. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వారిదే కీలకపాత్ర. అటు పార్టీ శ్రేణులు, ఇటు ప్రభుత్వ ఉద్యోగులకంటే వీరిదే తుది నిర్ణయం. వారి సేవలను కీర్తిస్తూ పురస్కారాలను కూడా అందించారు. అలాంటి వలంటీర్లను ఇప్పుడు జీరోలను చేస్తున్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం వారిని పావులుగా వాడుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీని బూచిగా చూపిస్తూ వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నాయకుల కనుసన్నల్లో రాజీనామాల కుతంత్రం జరుగుతుంది. వలంటీర్స్ మండల లెవల్ అధికారుల గ్రూపులలో డైరెక్టుగా మెసేజ్ పెడుతూ రాజీనామాలపై వత్తిడి చేస్తున్నారు. అంతేకాకుండా స్థానిక నాయకులు కూడా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే పనిలో పడ్డారు. మరలా మన పార్టీ వస్తుంది.. అప్పుడు మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తాం.. ముందు మీరు రాజీనామా చేయండి అంటూ హుకుంలు జారీ చేస్తున్నారు. తాజాగా ప్రత్తిపాడులో 65 మంది వలంటీర్లు ఉండగా వారిలో 59 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వట్టిచెరుకూరు మండలం గారపాడు, కుర్నూతల గ్రామాలలో వలంటీర్లు కొందరు రాజీనామా చేశారు. ఇదే రీతిలో మిగిలిన గ్రామాల్లో కూడా వలంటీర్ల చేత రాజీనామా చేయించే పనిలో వైసీపీ నాయకులు ఉన్నారు.

కోడ్‌కు తూట్లు

- ఆలయంలో వైసీపీ కండువాతో అభ్యర్థి పూజలు
- పూర్ణకుంభంతో స్వాగతంపై విమర్శలు

అద్దంకి, ఏప్రిల్ 9: ఎన్నికల నిబంధనలకు వైసీపీ నేతలు తూట్లు పొడుస్తున్నారు. ఆలయాలను కూడా అధికార పార్టీ నేతలు వదలడంలేదు. ఉగాది పండుగ సందర్భంగా వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి పాణెం చినహనిమిరెడ్డి మంగళవారం పట్టణంలోని పాత శివాలయంలో పూజలకు హాజరయ్యారు. వైసీపీ కండువాను ధరించి మరీ ఆయన ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేయడంతో పాటు పూజలు చేశారు. పార్టీ కండువా ధరించి వచ్చిన హనిమిరెడ్డికి పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలకడం విమర్శలకు తావిచ్చింది. కోడ్ అమలులో ఉండగా వైసీపీ కండువాలతో ఆలయంలోకి రావడం.. అలా వచ్చిన వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకడంపై భక్తులు మండిపడుతున్నారు.



పాత శివాలయంలో వైసీపీ కండువాతో అభ్యర్థి హనిమిరెడ్డి

చెక్‌పోస్టుల వద్ద పోలీసు తనిఖీలు

బాపట్లరూరల్, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా చెక్‌పోస్టుల వద్ద కేంద్ర సాయుధ బలగాల తో పోలీసులు మంగళవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి అవకాశం ఉన్న ఇతర వస్తువులు, బహుమతుల రవాణాను అరికట్టడానికి చెక్‌పోస్టులు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఎన్నికల వరకు నిరంతరం కొనసాగతాయని పోలీసు అధికారులు తెలిపారు. ద్విచక్రవాహనాలు, కార్లు, గూడ్స్ వాహనాలు, బస్సులు, ఇతర అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని, నగదును, ఇతర వస్తువులను సీజ్ చేస్తున్నట్లు ఎస్పీ వకూల్ జిందాల్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆమంచి.. కాంగ్రెస్‌కు జై

- త్వరలో షర్మిల సమక్షంలో పార్టీ ప్రవేశం
- త్వరలో పీసీసీ చీఫ్‌తో చీరాలలో బహిరంగ సభ
- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్

చీరాల, ఏప్రిల్ 9: రాజకీయ వివాదాలకు కేంద్ర బింధువు.. విలక్షణ అడుగులు, నిర్ణయాలకు పెట్టింది పేరైన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ తాజాగా కాంగ్రెస్‌కు జై కొట్టారు. ఇటీవల వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన తన రాజకీయ అడుగులు ఎటు అన్న సందేహానికి తెరదించారు. చీరాలలో పోటీ చేయడమే తన ధ్యేయమన్న ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని తన నివాసంలో మంగళవారం అనుచరులు, అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించారు. టీడీపీ, వైసీపీలకు సమదూరం పాటిస్తానని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ తనకు ఎంతో విలువ ఇచ్చారని చెప్పారు. ఆలోచనపరంగా, సిద్ధాంతపరంగా ఆయా పార్టీలలో ఉన్నప్పుడు ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో ఆ పార్టీల్లో ఇమడలేక బయటకు వచ్చినట్లు వివరించారు. ఈ పరిస్థితుల్లో అభిమానులు, అనుచరుల సూచనల మేరకు జాతీయ పార్టీ అయితే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆమంచి స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉంటానని, తనను గెలిపించాలని కోరారు. త్వరలో పీసీసీ చీఫ్ షర్మిలను కలిసి, సమయం తీసుకుని చీరాల నియోజకవర్గంలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ సందర్భంగా తాను, తన శ్రేణులు ఆ రోజు కాంగ్రెస్ పార్టీలో చేరతామన్నారు. ఎమ్మెల్యే బలరాం, ఆయన తనయుడు వెంకటేశ్ ఆర్థిక దోపిడీ, అరాచకాలకు పాల్పడ్డారని విమర్శించారు. వారి చర్యలను టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య ఏ మాత్రం ఖండించలేదన్నారు. తానెప్పుడు ఆర్థిక బలం, కుల బలం గురించి ఆలోచించలేదన్నారు. భావసారూప్యం ఉన్న ప్రతి ఒక్కరిని తన అభిమానులు, శ్రేయోభిలాషులుగానే భావిస్తానన్నారు.

నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు

మాజీ ఎమ్మెల్యే ఆమంచి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరేందుకు తీసుకున్న నిర్ణయంపై రాజకీయవర్గాలతో పాటు ఆయన సానుభూతిపరుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. టీడీపీకి, వైసీపీకి సమదూరం అనిచెప్పటం పాత పక్కీయేనంటున్నారు. అది కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా ఉందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమంచి నవోదయం పార్టీ(ఆటోగుర్తు)పై పోటీ చేశారు. గెలిచి టీడీపీలోకి వస్తానని టీడీపీ వారికి, వైసీపీలోకి వస్తానని వైసీపీ వారికి నమ్మించారు. అప్పట్లో ఆ ఫార్ములా సత్ఫలితాలనిచ్చింది. ఇప్పుడు అదే ఫార్ములా ప్రయోగిస్తున్నారు. తన గెలుపు, ఓటమి అనేది పక్కన పెడితే కరణంని ఓడించడమే అంతిమ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమంచి ముందు రెండు మార్గాలున్నాయి. తను నేరుగా గెలవడం ఒక మార్గం. లేదా వైసీపీ ఓటు బ్యాంకును భారీగా చీల్చి కరణంను ఓడించడం. ఈ రెండు మార్గాల్లో ఏ మార్గం ఎంచుకుంటారనే విషయమ్మై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

దిక్సూచి
DIKSUCHI

SCHOLARSHIP ALERT

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000 *Last Date:* 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్ధేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in

హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు.. మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫొర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపి: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్చికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.

వైభవంగా ఉగాది



ఉగాది పూజల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఏప్రిల్9: తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన పండగల్లో ఒకటైన ఉగాదిని పల్నాడు జిల్లా ప్రజలు మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. వేద పండితుల పంచాంగ శ్రవణాలతో అంతటా తెలుగు కళ ఉట్టిపడింది. ఉగాదిని పురష్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ ఏడాదిలో రాశిఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునే ఉత్సుకత అందరిలో కనిపించింది. వేద పండితులు వారి పేరుకు తగ్గట్టు ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దేవాలయాల్లో పంచాగ శ్రవణాలు నిర్వహించారు.

నరసరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానిక ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

సత్తెనపల్లిలోని తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఉగాది వేడుకలు జరుపుకున్నారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మూడు ముక్కలాటకు స్వస్తి పలకాలి

- లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు
- 1575వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్ 9: మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని, బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1575వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు, మహిళలు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వైసీపీ పాలకులుఒ చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి కళ్లు తెరవకపోతే జీవితంలో మూడు అని చేసిన దుర్మార్గానికి తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు.అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రచారంలో పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్



తక్కెళ్ళపాడు ప్రచారంలో కూటమి అభ్యర్థులు పెమ్మసాని, ధూళిపాళ్ల, వారికి బాబు జగ్జీవన్‌రావు చిత్రపటాన్ని అందిస్తున్న స్థానిక టీడీపీ నేతలు

పెదకాకాని, ఏప్రిల్ 9: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, మరో 30 ఏళ్లపాటు సుదీర్ఘ రాజకీయాలు చేస్తానని గుంటూరు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు, వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, గోళ్లమూడి, నంబూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వడ్రాణం మార్కండేయబాబు, తాళ్ల వెంకటేష్‌యాదవ్, ఉగ్గిరాల సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రశేఖర్, నరేంద్రకుమార్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కారం చేస్తామన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ పథకం కింద రూ.5లక్షల వరకు పరిమితి ఉండేది, దానిని ఇప్పటి ప్రభుత్వం రూ.3 లక్షల తగ్గించిందని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి తెలిపారు. మహిళలకు మహాశక్తి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామని తెలిపారు. వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాల ప్రజలకు శాశ్వతంగా మంచి నీళ్లు అందేటట్లు చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి పంట పొలాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షులు వెలినేని శ్రీనివాసరావు(బాబు), మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరెళ్ళ వెంకటేశ్వరరావు, బీజేపీ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, పెదకాకాని మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.





తక్కెళ్ళపాడులో భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న పెమ్మసాని, వేదికపై నరేంద్ర, జనసేన ఇన్‌చార్జి వడ్రాణం మార్కండేయబాబు

పాత కేసులు తీయండి.. నోటీసులు ఇవ్వండి

- కోడ్ వచ్చినా తీరు మారని పోలీసులు
- అధికార పక్షం సేవలో తరిస్తున్న అధికారులు
- ప్రతిపక్ష నేతలకు నోటీసులు, వేధింపులు
- నాలుగున్నరేళ్ల క్రితం పెట్టిన అక్రమ కేసుల వెలికితీత
- వాటి ఆధారంగా ఎన్నికలకు దూరం చేసే కుట్ర
- కనపర్తిపై ఏకంగా 18 కేసులు.. తాజాగా 6 నోటీసులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా అధికార పార్టీ సేవలో తరిస్తోందన్న అపకీర్తిని మూటగట్టుకున్న రాష్ట్ర పోలీసు యంత్రాంగం తీరు ఇప్పటికీ మారినట్లుగా లేదు. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా, పరిపాలన అంతా ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లిపోయినా పోలీసులు మాత్రం తమ స్వామి భక్తిని చాటుకుంటూనే వున్నారు. ఇప్పటికే గుంటూరు నగరంలో ఇద్దరు నేతలకు నోటీసులు జారీ చేసిన పోలీసు అధికారులు, మిగిలిన టీడీపీ నాయకులపై పెట్టిన కేసులను కూడా తిరగదోడే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రతిపక్షాలకు చెందిన కీలక నేతలందరినీ అదుపులోకి తీసుకోవడమో, కేసుల పేరుతో ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడమో లక్ష్యంగా అధికార పార్టీ ఈ కుట్రలకు పాల్పడుతుందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



కనపర్తి శ్రీనివాసరావుకు 41ఏ నోటీసులు ఇస్తున్న అరండల్‌పేట ఎస్ఐ నరేంద్ర, ఏఎస్ఐ నాగేశ్వరరావు

కరోనా కేసులకు ఇప్పుడు నోటీసులు

అధికార వైసీపీ కరోనా లాక్‌డౌన్ నిబంధనలను తన స్వప్రయోజనాల కోసం వాడుకున్నట్లు తాజాగా వెలుగు చూస్తున్న కేసులను బట్టి తెలుస్తోంది. లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారన్న పేరుతో ప్రతిపక్ష టీడీపీ నేతలపై ఇష్టారాజ్యంగా కేసులు బనాయించి వాటిని ఇప్పుడు ప్రతిపక్షాలపై ప్రయోగిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం పెట్టిన కేసులను ఇప్పుడు తిరగదోడి ప్రతిపక్ష నాయకులకు 41ఏ నోటీసులు జారీ చేస్తున్నారు. కేసుల విచారణ పేరుతో వేధింపులకు దిగుతున్నారు. సరిగ్గా వారం రోజుల క్రితం తెలుగుయువత నేతకు 41ఏ నోటీసులు ఇచ్చిన పోలీసులు తాజాగా మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుకు నోటీసులు అందజేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. అసలు తమపై ఆ కేసులు ఉన్నాయని కూడా చాలామంది ప్రతిపక్ష నేతలకు తెలియదు. నోటీసులు ఎందుకిస్తున్నారని ఆరా తీసిన కనపర్తికి ఇలాంటి అనుభవమే ఎదురైంది. అతడిపై అరండల్‌పేట స్టేషన్ పరిధిలో 9 కేసులు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒక హత్యానేరం కేసుతో పాటు 3 కేసులు, కొత్తపేట స్టేషన్ పరిధిలో 3, లాలాపేట స్టేషన్ పరిధిలో 1, నగరంపాలెం పరిధిలో 1, నందిగామలో 2 కేసులు, మొత్తంగా 19 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో ప్రతిపక్ష పార్టీల్లో కలకలం రేగింది.

ఎన్నికల కమిషన్‌పై నెపం

అధికార వైసీపీ సేవలో తరిస్తున్న పోలీసులను నోటీసులందుకున్న ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తుండడంతో పోలీసులు ఎన్నికల కమిషన్ మీదకు నెపం మోపుతున్నారు. తమకేమీ సంబంధం లేదని, గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసులు కేసులు నమోదు చేశారని, తామేమీ కొత్తగా కేసులు నమోదు చేయలేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసులు ఇవ్వాల్సి వస్తోందని అమాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. కాగా వైసీపీ మంత్రి విడుదల రజిని ఒత్తిడితోనే పోలీసులు ఇలా చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. గెలుపు మీద నమ్మకం లేని మంత్రి, వైసీపీ నేతలు ఇలా ప్రతిపక్షాల చేతులు నరికేసి అడ్డదారిలో గెలుపొందాలని చూస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

నోటీసులు ఇప్పుడెందుకు ఇస్తున్నారు?: కనపర్తి

కరోనా సమయంలో చేసిన ధర్నాలు, నిరసనలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇవ్వడమేంటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. అరండల్‌పేట స్టేషన్ ఎస్ఐ నాగేంద్ర, ఏఎస్ఐ నాగేశ్వరరావులు మంగళవారం కనపర్తిని ఆయన ఇంట్లో కలిసి నోటీసులు జారీ చేశారు. మొత్తం 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఆయన నిలదీశారు. తనపై 19 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారని, మంత్రి రజని ఒత్తిడితోనే పాత కేసులను బయటకు తీసి నోటీసులు ఇస్తున్నారని అన్నారు. కేసులు, నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, న్యాయపోరాటం చేస్తానని తేల్చి చెప్పారు.

సాహితీ ప్రగతిని సాధించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9: ఆర్థిక, సాంకేతిక ఔన్నత్యంతో పాటు విద్యార్థులు సాహితీ ప్రగతిని సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు తెలిపారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీక్రోధనామ సంవత్సర ఉగాది సందర్భంగా 27 వసంతాల సాహితీ వసంతోత్సవం మంగళవారం స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వైభవంగా జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహకులు రామారావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ మధ్య బెంచ్‌కు వచ్చి కేసులను చూస్తుంటే బాధగా ఉందన్నారు. వాటిలో ఆస్తి కోసం రక్తసంబంధీకులను చంపడం, వృద్ధులను ఆశ్రమాలకు పంపడం చూస్తుంటే మరింత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించాలని, అప్పుడే మానవత్వ సహిత సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. కళలను ఎందుకు ఆదరించాలి, లేనిపక్షంలో జరిగే దుష్పరిణామాలను యువత తెలుసు కోవాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్న సాహితి సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజున శ్రీ రామ పట్టాభిషేకం, విక్రమాదిత్య, శాలివాహన రాజ్యాలు ఆవిర్భావం జరిగాయని, ఇటువంటి రోజున పండుగ జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. అంతకుమందు శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం సుప్రసిద్ధ పండితులు, అవధాని డాక్టర్.ధూళిపాళ్ళ మహాదేవమణికి క్రోధనామ సాహితీ పుర స్కారం ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత చంద్ర బోస్‌కు సత్కారం చేశారు. సాహితీ సమ్మేళనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సరస్వతి సమ్మాన్ కె.శివారెడ్డి, పండితులు మహాదేవమణి, సినీ నృత్యదర్శకులు సుచిత్ర చంద్రబోస్, కవి డాక్టర్. అందేశ్రీ, శతావధాని డాక్టర్. బులుసు అపర్ణ, యువ అవధాని ఉప్పలదడియం భరత శర్మ, సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.



డాక్టర్. ధూళిపాళ్ళ మహాదేవమణికి శ్రీక్రోధ నామ సాహితీ పురస్కారం అందజేస్తున్న జస్టిస్ యూ దుర్గాప్రసాదు, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



వైభవంగా బాజీబాబా ఉరుసు మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షాహిద్ ఆవులియ బాబా దర్గా 536వ ఉరుసు మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన బాబా భక్తులతో దర్గా ప్రాంగణం జనసంద్రంగా మారింది. దర్గా నుంచి బాజీబాబా గుర్రం పెదకాకాని, వెనిగండ్ల పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం తిరిగి దర్గాలోకి ప్రవేశించారు. బాజీ బాబా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు గంధం పంచిపెట్టారు. భక్తులు దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ఈవో షేక్ ముక్తార్ బాష, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్

నరసరావుపేట, ఏప్రిల్ 9: నరసరావుపేట కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పట్టణానికి చెందిన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆయన పేరును మంగళవారం ప్రకటించారు. ఆయన నరసరావుపేటలో న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు నరసరావుపేటలో పలు కార్యక్రమాలను అలెగ్జాండర్ నిర్వహించారు.

ఆశా కార్యకర్త వైసీపీ ప్రచారం



నూజెండ్ల, ఏప్రిల్ 9: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మూలవీసాల రేణుకాదేవి సోమవారం మండలంలోని జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొన్నారు. వైసీపీ గుర్తులు ఉన్న టోపీ ధరించి పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇతర పార్టీ నాయకుల గురించి ఆమె చులకనగా మాట్లాడటంపై మంగళవారం టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా దశావతారునికి పుష్ప యాగం



పెదకాకాని, ఏప్రిల్ 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీదశావతార వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అత్యంత వైభవంగా పుష్పయాగం జరిపించారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర రావు దంపతులచే బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఆరు టన్నుల 14 రకాల ప్రత్యేక పచ్చి పూలతో ఏడుకొండలుగా డెకరేషన్ చేశార ఉదయం ఐదు నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయాన్ని కృష్ణా గుంటూరు జిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు దర్శించారు. దశావతార వెంకటేశ్వర స్వామివారికి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనేకమంది ప్రముఖులు ఆలయాన్ని దర్శించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణాన్ని జరిపించారు.

వలంటీర్లకు టీడీపీలో మంచి భవిష్యత్ : యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న వలంటీర్లకు రానున్న టీడీపీ ప్రభుత్వంలో మెరుగైన వేతనాలతో పాటు మంచి భవిష్యత్ వుండేలా చూడటం జరుగుతుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది తీపికబురుగా చంద్రబాబునాయుడు ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లలో హర్షం వ్యక్తమవుతుందని, వలంటీర్ల కనీస వేతనం రూ.10 వేలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్ వున్న వారికి మరికొన్ని అవకాశాలతో ఎక్కువ వేతనం అందజేసేలా చూడటం జరుగుతుందన్నారు. వైసీపీ నేతల మాటలు నమ్మి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొని భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దన్నారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న వలంటీర్లకు గౌరవ వేతనం పెంచకుండా ఎన్నో పనులు చేయించుకుంటున్నారన్నారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది.. అప్పటి నుంచి వలంటీర్ల ద్వారానే అవ్వ, తాతల ఇళ్లకు వెళ్లి రూ.4 వేల పింఛన్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ఎవరైనా కూడా రాజీనామాలు చేయవద్దని, భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని యరపతినేని సూచించారు.

రాబోయే చంద్రన్న పాలనలో ఇంతకు మించి పింఛన్లు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 9: పెన్షన్‌లు, సంక్షేమం జగన్ ముఖ్యమంత్రి కాకముందు ఉన్నాయి.. దిగి పోయిన తరువాత ఉంటాయని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఈ నిజాన్ని దాచి కొంత కాలంగా ఏదో వైసీపీ ఓడిపోతే పెన్షన్‌లు ఆగిపోతాయని వైసీపీ నేతలు, జగన్ వాళ్ళ బ్లూ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అబద్ధపు ప్రచారం ద్వారా ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి భయపెట్టి ఓట్లు దండుకోవాలనే కుట్ర వారి చర్యల్లో కన్పిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో 18వ వార్డులో మంగళవారం ఎన్నికల శంఖారావం, సూపర్ - 6 పథకాలపై ప్రత్తిపాటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వృద్ధుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కుటుంబ సాధికార సారధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎవ్వరూ వైసీపీ, జగన్ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, రానున్న ప్రజా ప్రభుత్వంలో చంద్రన్న ముఖ్యమంత్రిగా ఇంతకు మించి పింఛన్‌లు, ఇంతకు మించి సంక్షేమాన్ని అందుకుంటారని భరోసాను ఇచ్చారు. ఉమ్మడి అభ్యర్థిగా తనను, ఎంపీ పార్లమెంట్ అభ్యర్థిగా శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్ తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని మల్లన్న సన్నిధిలో జరిగిన ఉగాది వేడుకల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. మంగళవారం రాత్రి ఆలయానికి చెందిన పాలక మండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఆలయ ఈవో, ఉప కమిషనర్ శ్రీరామవరప్రసాద్‌లు ఉగాది పురస్కారాలను అర్చకులకు అందజేశారు. అర్చకులను సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమం అంతా ఆలయ పాలక మండలి ఛైర్మన్ శివశంకరరావు, మరికొందరు పాలక వర్గ సభ్యులు దగ్గరుండి నిర్వహించారు. ఎన్నికల కోడ్ గత నెల 16 నుంచి అమలులోకి రాగా శివాలయంలో ఇప్పటికే ఆలయ ఛైర్మన్ తన చాంబర్‌లో రూమ్‌లను వినియోగించుకోవటమే కాకుండా ఆలయంలో ఎన్నికల కోడ్ అమలు చేయటం లేదు. దీనిపై పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి.

రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరు చోరీ

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండలంలోని రొంపిచర్ల రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీ చేశారు. రెండు గంటల తరువాత సుమారు పదిమంది వ్యక్తులు స్టేషన్ వద్దకు వచ్చి రాళ్ళు విసిరారు. అనంతరం మెట్ల పక్కన ఉన్న కాపర్ వైరును దొంగతనం చేసి తీసుకు వెళ్ళారు. ఈ ఘటనపై సమాచారాన్ని రొంపిచర్ల పోలీసులకు, రైల్వే పోలీసులకు అక్కడ ఉన్న సిబ్బంది తెలిపారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించి వెళ్ళారు.

20 రోజుల పాటు జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు - మంగళగిరి మధ్యన రైల్వేట్రాక్ మరమ్మతులు కారణంగా ట్రైన్ నెంబరు.12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ధి ఎక్స్‌ప్రెస్‌ని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ రైలు న్యూగుంటూరు రాకుండా తెనాలి నుంచి నేరుగా కృష్ణాకెనాల్ మీదగా విజయవాడకు చేరుకొంటుంది. అలానే నెంబరు 07464 విజయవాడ - గుంటూరు ప్యాసింజర్ రైలుని పైన పేర్కొన్న తేదీల్లో పూర్తిగా రద్దు చేశామన్నారు. నెంబరు.07465 గుంటూరు - విజయవాడ రైలు కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

గిరిజన ద్రోహి సీఎం జగన్

గుంటూరు, ఏప్రిల్ 9: ఎస్టీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ అన్నారు. వైసీపీ పాలకులు ఎస్సీ, ఎస్టీ, మైనారి టీ, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసి నయవంచనకు గురి చేశారన్నారు. టీడీపీ హయాంలో 500 మంది జనాభా కలిగిన గ్రామాలను ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తే జగన్‌రెడ్డి అధికార అందలం ఎక్కిన తర్వాత గిరిజన గ్రామాలకు పంచాయితీ నిధులు కేటాయించక పోవటమే కాకుండా సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారన్నారు. గత ఎన్నికల్లో 87 శాతం గిరిజనులు జగన్‌రెడ్డికి ఓట్లు వేసినా ప్రతీకార చర్యగా వారిపైనే కేసులు, భౌతిక దాడులు సాధారణమయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అంబేద్కర్ విదేశీ విద్య పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మేకలవారిపాలెం వైసీపీ నాయకులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నరేంద్రవర్మ

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కర్లపాలెం, ఏప్రిల్ 9 : కర్లపాలెం మండలంలోని పేరలి పంచాయతీ మేకలవారిపాలెం గ్రామానికి చెందిన 20 మంది వైసీపీ యువకులు బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. నరేంద్రవర్మ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఊట్ల రామారావు, నక్కల వెంకటస్వామి, దేవలపల్లి రాజా, మద్దిబోయన చిట్టిబాబు, మేకల విక్టర్ తదితరులు పాల్గొనగా మేకల బెంజిమెన్, రాము, విజేష్, తరుణ్, నవీన్, ప్రకాష్, రాజు, కేశవ, రాజా, అఖిల్, రాజేష్, వినోద్, సన్ని, పర్వీన్ రాజు, ఏపూరి జోసఫ్, గేరా కిరణ్, క్లైమెంట్, ప్రవీణ్, దీవెనరాజు, మధు తదితరులు పార్టీలో చేరారు.

రైతు ఉత్పత్తులు మద్దతు ధరకే కొనేవిధంగా చూడాలి

● కూటమి అభ్యర్థులను కోరిన బీజేపీ నాయకులు



తెన్నేటి కృష్ణప్రసాద్, నరేంద్రవర్మలకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బాపట్ల,ఏప్రిల్ 9 : బాపట్ల నియోజకవర్గంలో రైతులు పండించే పంటలను గ్రామపంచాయతీ పరిధిలోనే మద్దతు ధరకు కొనేవిధంగా చూడాలని ఈ విషయాన్ని మేనిఫెస్టో కమిటీ పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్‌లను కోరుతూ బీజేపీనాయకులు ఆట్ల వెంకటకృష్ణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎంపీ అభ్యర్థి నివాసంలో మంగళవారం పార్టీశ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ వరి, అపరాలు, వేరుశనగ, పచ్చిమిర్చి పంటలు ఈ ప్రాంతంలో పండిస్తారు కావున వీటికి మంచి ధర కల్పించాలని కోరారు. చిన్న, సన్నకారు, ఆక్వా రైతులకు ఉచిత విద్యుత్, పంటకు మద్దతు ధరతోపాటు ప్రాసెసింగ్ యూనిట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నంగు శివనాగులురెడ్డి, సముద్రాలురెడ్డి, బాబులురెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అంబటి సమీప బంధువు మురళీకృష్ణ టీడీపీలో చేరిక



అంబటి మురళీకృష్ణకు కండువా కప్పి పార్టీలో చేర్చుకుంటున్న చంద్రబాబు

బాపట్ల, ఏప్రిల్ 9 : రాష్ట్రమంత్రి అంబటి రాంబాబు సమీప బంధువు, వివేకాస ర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గత ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గంలో అంబటి రాంబాబు గెలుపు కోసం క్రియాశీలకంగా వ్యవహరించిన మురళీకృష్ణ పొన్నూరు టిక్కెట్టు ఆశించారు. అయితే మంత్రి సోదరుడు అంబటి మురళీకృష్ణకు టిక్కెట్టు కేటాయించిన నాటి నుంచి ఈయన తటస్థంగా ఉంటూ వచ్చారు. ఎంతోకాలంగా అంబటి రాంబాబుకు మద్దతుగా నిలిచిన మురళీకృష్ణ మంగళవారం తన స్నేహితుడు ప్రముఖ న్యాయవాది, ధృతి సాహిత్య సంస్థ అధ్యక్షుడు కళ్ళం హరినాధరెడ్డితో కలిసి టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. సేవ, సాహిత్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పనిచేసే అంబటి మురళీకృష్ణ 2010లో జగన్మోహనరెడ్డి పాదయాత్ర చేస్తూ వెదుళ్ళపల్లి వచ్చిన సందర్భంలో ఆయనకు బస ఏర్పాటు చేశారు. 1989 నుంచి రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పదవులు ఆశించకుండా పనిచేశారు. తాజాగా భజరంగ్ సీఈవో అంబటి మురళీకృష్ణకు పొన్నూరు టిక్కెట్టు కేటాయించటంలో కూడా సహకరించారు. హఠాత్తుగా అంబటి మురళీకృష్ణ ఈ నిర్ణయం తీసుకొని పార్టీ మారడం చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక కారణాలను త్వరలో మురళీకృష్ణ వివరిస్తారని అనుచరులు అంటున్నారు.

యువ కవుల ద్వారా తెలుగు భాష వికాసం



సభలో మాట్లాడుతున్న తిమ్మన శ్యామ్‌సుందర్

బాపట్ల, ఏప్రిల్ 9 : తెలుగు భాషకు, సాహిత్యానికి తమ జీవితాన్ని అంకితం చేసిన సాహితీవేత్తలను స్మరించుకోవటం, తద్వారా వారి రచనలలోని ఆంతర్యాన్ని గ్రహించి తెలుగుభాషను అభివృద్ధి పర్చుకోవటం నేటితరం యువకుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ అన్నారు. భావపురి విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవసభలో శ్యామ్‌సుందర్ పాల్గొని ప్రసంగించారు. ఎందరో ఉత్తమ సాహితీవేత్తలకు జన్మనిచ్చిన బాపట్ల ఆలనాటి సాహితీపరంపరం నేటికి కొనసాగిస్తూ ఉండటం గర్వించతగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా జరిగిన నూతన కమిటీ ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా తిమ్మన శ్యామ్‌సుందర్, ఉపాధ్యక్షులుగా పోలాసం వీరాంజనేయులు, పడాలి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నందిరాజు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా డాక్టర్ మేకల రాజు, టెక్నికల్ సెక్రటరీగా షేక్ బాబావలి, ముఖ్యకోశాధికారిగా ఆక్సినూరు బాషా ఖాశీం, కోశాధికారిగా అన్నం పూర్ణచంద్రరావు, గౌరవాధ్యక్షులుగా పోగుల విజయశ్రీ, బత్తుల బ్రహ్మారెడ్డి, కార్యనిర్వహణ కమిటీ సభ్యులుగా పాత సభ్యులే కొనసాగుతారని తెలిపారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో పలువురు తమ కవితల ద్వారా తెలుగుభాష విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమాన్ని నందిరాజు విజయ్‌కుమార్ నిర్వహించారు.

చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుడు

బాపట్ల, ఏప్రిల్ 9 : దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాప్రకటించటంతో బాపట్ల దివ్యాంగుల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీలోని దివ్యాంగులు ఈ సందర్భంగా చంద్రబాబు పటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ పాలనలోనే దివ్యాంగులకు మేలు జరిగిందని వైసీపీ పాలనలో దివ్యాంగులకు ఏ ఒక్క మంచి జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు, సోముల ప్రసాద్, పి.లక్ష్మీ, రాజారావు, నరసింహారావు, అన్నమ్మ, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య నాయకులతో జేడీ శీలం భేటి

బాపట్ల, ఏప్రిల్ 9 : మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు జేడీ శీలం మంగళవారం రాత్రి బాపట్ల ఆర్యవైశ్య సంఘనాయకులతో సమావేశమయ్యారు. శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులు అందుకున్న తర్వాత పార్టీశ్రేణులతో కలిసి ఆర్యవైశ్య సంఘనాయకులతో సమావేశం అయ్యారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘనాయకులు డాక్టర్ కొత్తమాసు సత్యనారాయణ, బూర్లె అనీల్‌కుమార్, వెల్లంపల్లి సత్యనారాయణ, ఎస్‌వీఆర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, శీలం సాగర్, బక్కా రోశయ్య, దోనేపూడి రవి పాల్గొన్నారు. అదేవిధంగా బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చర్చలు జరిపారు.

ఎలుకల మందు తాగిన మహిళ

బాపట్ల, ఏప్రిల్ 9 : పట్టణంలోని 11వవార్డు దేవుని మాన్యంకు చెందిన బాల వెంకటేశ్వరమ్మను అదేప్రాంతానికి చెందిన సనకా వెంకటేశ్వరరావు, దుర్గాభవానీ, మరొక మహిళతో కలిసి కొట్టటంతో మనస్థాపానికి గురైన ఆమె ఎలుకల మందు తాగినట్లు పట్టణ సీఐ య.శ్రీనివాసులు తెలిపారు. తన కోడి గుడ్డు ఎక్కడపెట్టిందోనని తిట్టుకుంటున్న వెంకటేశ్వరమ్మను అకారణంగా కొట్టటంతో పెద్దలకు చెప్పినప్పటికి పట్టించుకోకపోవటంతో మనస్థాపంతో ఎలుకల మందు తాగి ఆసుపత్రిలో చేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీడీపీతోనే ప్రజలకు మెరుగైన భవిష్యత్తు

● వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 9: తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమని బీజేపీ, జనసేన, తెలుగుదేశం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్‌లు అన్నారు. మండలంలోని సంగుపాలెం కోడూరు, కోమలి, భవనవారిపాలెం గ్రామ పంచాయతీలలో మంగళవారం సాయంత్రం నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్‌లు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామపంచాయతీల్లో ఇంటింటికెళ్ళి వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయా గ్రామ పంచాయతీలలోని పలు చర్చిలలో, దేవాలయాలలో పార్టీనాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రార్థనలు, పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పొందుపరిచిన బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. తల్లికి వందనం పేరుతో మీఇంట్లో ఎంతమంది పిల్లలు ఎంతమంది చదువుకుంటే వారందరికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, దీపం పథకం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండెర్లు, ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, ప్రతిరైతుకు ఏటా రూ.20వేల రూపాయల ఆర్థిక సాయం, బీసీలకు రక్షణ చట్టం కింద వారికి అన్నివిధాలుగా అండదండలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నామన శివన్నారాయణ, కృష్ణమూర్తిరాజు, ఖాజీపాలెం టీడీపీ యువనాయులు కొత్తపల్లి పృధ్వీరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు దండు శ్రీనివాసరాజు, మెండు చంటి, మండల టీడీపీ అధ్యక్షులు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు మంతెన వెంకటపతిరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాశీం, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యులు, కోడూరి సర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శ్యామల మోహనరెడ్డి, కడియాల ప్రసాద్, జాలాది అశోక్, మాజీ ఎంపీపీ బొలగాని సులోచన నారాయణ, పార్టీ నాయకులు కలకోట చక్రధర్‌రెడ్డి, భవనం సుబ్బారెడ్డి, భవనం వారిపాలెం సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, యేమినేని శ్రీనివాసరావు, భవనం సుబ్బారెడ్డి, చందోలు గ్రామ టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, మాజీ రైల్వేబోర్డు సభ్యులు టీడీపీ నాయకులు ఎస్.ఎం.నియాజి, టీడీపీ మండల బీసీసెల్ అధ్యక్షులు పందరబోయన విష్ణువర్ధన్, మంతెనవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు పందరబోయన మురళీ, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మద్దాల డేవిడ్, పిట్టలవానిపాలెం మండల బీజేపీ మాజీ అధ్యక్షులు పరిమి రామకృష్ణసాయి, సీనియర్ బీజేపీ నాయకులు షేక్.కరీముల్లా, చందోలు గ్రామటీడీపీ అధ్యక్షులు మహ్మద్ రజాక్, మండల మైనార్టీ నాయకులు షేక్.మీరా, దర్శి జీవరత్నం బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, తెలుగు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు

● ఘనంగా పంచాంగ శ్రవణ కార్యక్రమం



దత్తాత్రేయ బ్రాహ్మణసంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో వేదపండితులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

రేపల్లె, ఏప్రిల్ 9 : శ్రీ క్రోధి నామ సంవత్సరంలో యావత్ ప్రజానీకం సుఖసంతోషాలతో గడుపుతారని వేద పండితుడు అప్పాజ్యోసుల దక్షిణామూర్తి అన్నారు. క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రామకోటిపేటలోని రాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తీర ప్రాంతంలో ప్రజలంతా పాడి పంటలతో కళకళలాడాలని కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది పిల్లాపాపలతో సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సుసర్ల మహాలక్ష్మి, ప్రబల నవ్యశ్రీ, నాగలక్ష్మి అపర్ణ, వైయొనలిస్టులను ప్రావీణ్యత కనబర్చినందుకు వారిని దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. వేద పండితులైన అప్పాజ్యోసుల దక్షిణామూర్తిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నూతన పంచాంగాన్ని, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు వడ్లమూడి ఉదయ ప్రసాద్, కార్యదర్శి పి.బి.ఎన్.శర్మ, కోశాధికారి విజయశారధి, గౌరవాధ్యక్షుడు సి.వి.మోహనరావు, వడ్లమూడి కృష్ణమోహనరావు, కొండవీటి ఆగస్య, దివి హరికుమార్, లక్ష్మణ శర్మ, రామకృష్ణ, రంగనాధాచార్యులు పాల్గొన్నారు.

ధూళిపూడిలో...

నగరం, ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సరంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేదపండితులు భానూ ప్రకాష్, మోహనరావు, మురళీలు ఆకాంక్షించారు. మండలంలోని ధూళిపూడిలోని గోకర్ణేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాశి ఫలాల గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శంకర్, నాగరాజు, శర్వణ్‌కుమార్, విజయ్‌కుమార్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సాహితిభారతి ఆధ్వర్యంలో...

బాపట్ల టౌన్, ఏప్రిల్ 9 : తెలుగు ప్రజలను చైతన్యం పరిచే సమ్మెకృతా భావాలకు, కష్టసుఖాలను సమంగా ఉంచే పండుగ ఉగాది అని సీనియర్ సిటిజన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ బ్రహ్మం, సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మలు సంయుక్తంగా తెలిపారు. సాహితిభారతి ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఉగాది సందర్భంగా జరిగిన సభలో వారు ప్రసంగించారు. ఈసందర్భంగా తెలుగు భాష పండితులు, బాషా ప్రవీణ ఉత్తమ అధ్యాపకుడు రెంటా రాధాకృష్ణమూర్తిని సాహితిభారతి ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో రావూరి నరసింహవర్మ, ఎం.మాల్యాద్రిరావు, ఆదంషఫి, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పీసీ సాయిబాబు, విశ్రాంత అధ్యాపకుడు జీవీ సుబ్రహ్మణ్యం, అంజిరెడ్డి, వెంకట్రావు, నాగేశ్వరరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎన్.కృష్ణ, జె.కృష్ణారావు, కస్తూరి శ్రీనివాసరావు, నీలకంఠేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

శ్రీభావపురి బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో...

బాపట్ల, ఏప్రిల్ 9 : పట్టణంలోని ఎవివి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం సాయంత్రం శ్రీభావపురి బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో పంచాంగశ్రవణం ఏర్పాటు చేశారు. వెంకటకృష్ణ శక్తిధర్ పంచాంగశ్రవణం నిర్వహించారు. కొత్త ఏడాదిలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని చెప్పారు. అనంతరం యల్లాప్రగడ నరసింహారావు, బొడ్డుపల్లి రామకృష్ణయ్య, గణపవరం ప్రసాద్ దంపతులను బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిభానుపూడి శ్రీహరి ప్రకాష్, సోమరాజు శ్రీనివాస్, పునపాటి శ్రీకాంత్, కొలను మోహను శ్రీనివాస్, బి.నారాయణ, బందాబాబు, కోన విజయ్ కుమార్, పి.రామారావు, సుబ్రహ్మణ్యం, సుబ్బరామయ్య, నాగరాజు, పోలూరి ప్రసాద్, సత్యంబాబు, శిఖరం ఫణిరాజశయన్, చెన్నాప్రగడ హరినాధశర్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ సొరకాయల అంకమ్మతల్లి ఆలయంలో...

కర్లపాలెం, ఏప్రిల్ 9 : మండలంలోని చింతాయపాలెంలో ఉన్న శ్రీ సొరకాయల అంకమ్మతల్లి సన్నిధిలో ఉగాది వేడుకలను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సొరకాయల అంకమ్మ తల్లికి పలు రకాల పూలతో పుష్పాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి పొంగళ్ళు పొంగించి దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు పెదమల్లు రంగారావు, మంగమ్మదంపతులు పొంగళ్ళు పొంగించి అనవాయితీగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. నందనవనం శ్రీనివాసరావు ఉగాది పంచాంగశ్రవణం వ్యాఖ్యానం చేశారు. కార్యక్రమంలో పెదమల్లు భాస్కరరావు, పెదమల్లు శ్రీనివాసరావు, ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ పుప్పాల సాయిబాబు, నర్రా సుబ్రహ్మణ్యం, పెదమల్లు వెంకట సూర్యనారాయణ, మార్కెండేయులు, ఉదయచంద్రరావు, అంకమ్మరావు దంపతులు పెదమల్లు కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు, ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మండల ప్రజానీకం మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక రథం సెంటర్‌లో గల శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, మండలంలోని పెదపులివర్రు గ్రామంలో గల రాజరాజనరేంద్రస్వామి, వరదరాజస్వామి దేవస్థానం, ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానాలలో పండితులు పంచాంగ శ్రవణం గావించారు. స్థానిక రథం సెంటర్‌లో గల భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం గావించిన వంగర చలమయ్య సిద్ధాంతిని ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు నూతన వస్త్రాలతో సత్కరించారు. నూతన పంచాంగాలను భక్తులను పంపిణీ చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పెరవలి శివాలయం అర్చకుడికి ఉగాది పురస్కారం

వేమూరు, ఏప్రిల్ 9 : మండలంలోని పెరవలి మల్లేశ్వర స్వామి ఆలయ వంశపారంపర్య అర్చకుడు చావలి రాధాకృష్ణమూర్తిని దేవాదాయ ధర్మదాయ శాఖ ఉగాది పురస్కారంతో సత్కరించింది. బాపట్లలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జేసీ శ్రీధర్ రాధాకృష్ణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్యబాబు, అర్చక సమాఖ్య ప్రతినిధులు దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ధార్మికత అవసరం : డాక్టర్ సాయిబాబాశర్మ

వేమూరు, ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సరంలో ఆగ్రహావేశాలతో కూడిన వాతావరణం సంతరించుకుంటుందని ప్రతి ఒక్కరూ ధార్మిక భావన కలిగి ఉంటే అటువంటి పరిస్థితులను అడ్డుకోగలుగుతామని ప్రముఖ జ్యోతిష్య, ఆగమ పండితులు డాక్టర్ చావలి సాయిబాబుశర్మ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అనేక గ్రామాలలో క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఆలయాల వద్ద నిర్వహించారు. పెరవలి సాయిబాబా మందిరంలో పంచాంగం శ్రవణం చేసిన సాయిబాబాశర్మ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు దిగుబడులు తగ్గినప్పటికీ గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. మండల పరిధి గ్రామాల్లోని శివ విష్ణు ఆలయాలలో వార్షిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా ఆలయాలకు విచ్చేసి ఉగాది పచ్చడిని విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. పంచాంగ శ్రవణం నిర్వహించే పండితులను సత్కరించారు.



రాధాకృష్ణమూర్తిని ఉగాది పురస్కారంతో సత్కరిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

కొల్లూరులో...

కొల్లూరు, ఏప్రిల్ 9 : పలు ఆలయాలలో పండితులు పంచాంగ శ్రవణం చేశారు. మంగళవారం క్రోధి నామ సంవత్సర ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరులోని అనంత భోగేశ్వర, మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పార్వతీ అమ్మవారి దేవస్థానంలో కూచిభట్ల శ్రీనివాసశర్మ క్రోధి నామ సంవత్సర పంచాంగం శ్రవణం చేసి క్రోధి అంటే అశాంతి, చెడు ప్రభావాలపై మాత్రమే క్రోధం చూపుతుందని, దీని వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ ఏడాది పాడి పంటలు సుభిక్షంగా ఉంటుందన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, మండల గ్రామాల్లోని పలు ఆలయాలలో పంచాంగ శ్రవణం చేసి భక్తులకు పంచాంగాలు పంపిణీ చేశారు. కొల్లూరులోని పార్వతీ అమ్మవారి దేవస్థానంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పంచాంగం శ్రవణం జరిగింది.

చుండూరులో...

చుండూరు, ఏప్రిల్ 9 : క్రోధినామ నామ ఉగాది వేడుకలు మండల గ్రామాల్లో విశేషంగా నిర్వహించారు. తెల్లవారు ఝామున భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలు, సాయంత్రం క్రోధినామ పంచాగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. చినపరిమిలోని శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, యడ్లపల్లి, మోదుకూరు, చుండూరు, నడిగడ్డపాలెం, వేటపాలెం, ఆలపాడు తదితర గ్రామ దేవాలయాల్లో జరిగిన ప్రచాంగ శ్రవణం చేశారు.



ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీలో చేరిన దుండిపాలెం వైసీపీ కార్యకర్తలు

చుండూరు ఏప్రిల్ 9 : దుండిపాలెం గ్రామానికి చెందిన 15 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం గుంటూరు పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ద్వారానే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని, గతంలో పొరపడి వైసీపీకి మద్దతు తెలిపామని, కానీ వాస్తవాలు వేరుగా ఉండటంతో తిరిగి తెలుగుదేశానికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వీరు తెలిపారు. ఆనందబాబు వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెకోనలో...

భట్టిప్రోలు, ఏప్రిల్ 9 : మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు టీడీపీలో చేరారు. సోమవారం రాత్రి అమర్తలూరు మండలం మూల్పూరులో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతిబాబుతో పాటుగా నాలుగు కుటుంబాలు టీడీపీలో చేరగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులమై చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీలో చేరుతున్నట్లు తిరుపతిబాబు తెలిపారు. పల్లెకోన గ్రామం నుంచి తిరుపతిబాబుతో పాటుగా పులివర్తి నాగబాబు, అద్దంకి లీలా, కె.బుల్లోడు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, అనూరాధ, గ్రేస్ ఫౌండేషన్ ఛైర్మన్ కైతేపల్లి షాలేంరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు తెలుగుదేశంలోనే అధిక ప్రాధాన్యం

● ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్



ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న డాక్టర్ అఖిలేశ్

చుండూరు, ఏప్రిల్ 9 : ముస్లిం వర్గాలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి యడ్లపల్లిలో ముస్లింలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్ధనలు, ఇఫ్తారు విందులో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ ఓర్పు, సహనం, దాన గుణం లాంటి ఎన్నో గొప్ప విషయాలను వెల్లడిస్తుందన్నారు. టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ 6 పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, గ్రామస్తులు, ముస్లిం పెద్దలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు



వేమూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విజయబాబు, రాజేష్ తదితరులు

వేమూరు, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో జగన్మోహన రెడ్డి పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పడ్డాయని తద్వారా రాష్ట్రం ఏ విధంగానూ పురోభివృద్ధికి నోచుకోలేకుండా పోయిందని, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ఆవేదన వ్యక్తపరిచారు. సార్వత్రిక ఎన్నికల్లో వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ల విజయాన్ని కాంక్షించి మంగళవారం వేమూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలతో కూడిన పాలనను వివరిస్తూ గతంలో టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఉసా రాజేష్ మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదిస్తే ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్ర అభివృద్ధికి కూటమి పాలన ఎంతగానో దోహద పడుతుందన్నారు. ప్రచార కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాల కారణంగానే కార్మికుల ఆత్మహత్యలు

భట్టిప్రోలు, ఏప్రిల్ 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు నాగానంద అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని తక్షణమే కార్మిక కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూలు, రంగులు, రసాయనాలపై విధించిన జీఎస్టీ వలన చేనేత వస్త్రాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొల్లూరు, ఏప్రిల్ 9 : అగ్నిబాధిత కుటుంబానికి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ తనవంతు ఆర్థికసాయం అందించారు. మండల పరిధిలోని తడికలపూడి గ్రామంలో ఈ నెల 7వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమై రావుల కిరణ్‌బాబు కుటుంబం నిరాశ్రయులయ్యారు. సమాచారం తెలుసుకున్న జువ్వలపాలెం మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి) బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి తనవంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కంచర్ల కోటయ్య, ముమ్మనేని లక్ష్మీనారాయణ, వేములపల్లి మోహనకృష్ణ, వేములపల్లి మధు, పొన్నమాల వెంకటేశ్వర్లు, యార్లగడ్డ రామమోహనరావు, కంచర్ల వెంకటేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అమృతలూరు, ఏప్రిల్ 9 : శివా టెంపుల్ యూత్ వ్యవస్థాపకుడు చేకూరు అనీల్ జ్ఞాపకార్ధం ఉచిత చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక శ్రీవిఘ్నేశ్వర ఆలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కూలింగ్ ఫ్రిజ్‌ను క్రొత్తపల్లి రవీంద్రబాబు, సాంబశివరావు ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ఈ చలివేంద్రంను ఏర్పాటు చేయడం జరిగిందని యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాపర్ల సుబ్బుకృష్ణ, పరుచూరి భానుప్రసాద్, శ్రీధర్, జగదీష్, బాబి పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

రేపల్లె, ఏప్రిల్ 9 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం ప్రధాన గేటు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం వేయటంతో నిప్పంటుకుని ట్రాన్స్‌ఫార్మర్ మంటలలో చిక్కుకుని భారీ పేలుడు సంభవించింది. ఉగాది సందర్భంగా సెలవుదినం కావటంతో ప్రజలెవరూ ఆ ప్రదేశంలో లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. సమీపంలో ఉన్న ప్రజలు ఫైర్ సిబ్బందికి తెలిపినా సకాలంలో స్పందించకపోవటం కారణంగా భారీ పేలుడు సంభవించింది.

ముళ్లచెట్లతో మూసుకుపోతున్న సాగర్ కాలువ

» తొలగింపు పనుల్లో అధికారుల నిర్లక్ష్యం

» దిగువ ప్రాంతాలకు కదలని నీరు » రైతుల ఆందోళన

మార్టూరు, ఏప్రిల్ 9 : సాగర్ కాలువలో పెరిగిన గడ్డి, నాచు, కొన్నిచోట్ల ఇరు వైపులా పెరిగిన తుమ్మ చెట్లు నీటి ప్రవాహ వేగానికి అడ్డంకి గా మారే అవ కాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కాలువలో రాళ్లు, రప్పలు లేచి కుప్పలుగా ఉన్నాయి. కోనంకి ఎన్నెస్పీ పరిధిలో బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద తూర్పు వైపున కాలువలో చిల్ల చెట్ల కారణంగా కాలువ వెడల్పు సగానికి సగం కనబడకుండా మారింది. కాలువలో పెరిగిన గడ్డి కారణంగా పచ్చగా కనిపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులలో సాగర్ కాలువకు విడుదలైన జలాలు కోనంకి ఎన్‌ఎస్‌పీ పరిధిలోని కాలువలకు వచ్చే అవకాశం ఉంది. గ్రామాలలో తాగునీటి నిమిత్తం మంచినీటి చెరువులను నింపడానికి సాగర్ జలాలను విడుదల చేశారు. రెండు నెలలు క్రితం కూడా సాగర్ జలాలును విడుదల చేశారు. కొన్ని చోట్ల సాగర్ కాలువలో పరిస్థితి అధ్వానంగా ఉంది. రాజుపాలెం మేజర్ నుంచి ఇసుకదర్శి, వలపర్ల, నాగరాజుపల్లి వైపు వచ్చే మైనర్ కాలువలో కొన్ని చోట్ల మట్టి కుప్పలు ఏర్పడడంతో పాటు చిల్ల చెట్లు కూడా పెరిగాయి. మేజర్‌లో నీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని ముందస్తుగా మార్టూరు పంచాయతీ వారు రెండు రోజుల కిందట ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు పనులు చేయించారు. యద్దనపూడి మేజర్, చిమ్మిరిబండ మైనర్, నూతలపాడు మైనర్ తదితర ప్రదేశాలలో మాత్రం నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదు. నాలుగేళ్లలో కాలువలో చిన్నపాటి మరమ్మతులను కూడా అధికారులు చేపట్టలేదు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామ సమీపంలోని మైనరు కాలువలో దాదాపుగా 10 అడుగుల మేర ఒక వైపు ఉన్న రక్షణ గోడ పడిపోయింది. ఇంతవరకు దాని మరమ్మతు పనులు చేయలేదు. సాగర్ కాలువకు నీరు వచ్చినప్పుడు అక్కడి గోడ పడిపోవడంతో నీరు ప్రక్కకు వెళ్లి పోయే అవకాశం ఉంది. కనీసం చిన్న పాటి మరమ్మతులను కూడా ప్రభుత్వం చేపట్టకపోవడంతో కాలువలు ముళ్ల పొదలతో మూసుకుపోతున్నాయి. దీంతో అరకొరగా వచ్చే సాగర్ నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లడంలో ఇబ్బందికరంగా మారిందని రైతులు అంటున్నారు.



బొల్లాపల్లి వద్ద సాగర్ కాలువలో పెరిగిన చిల్ల చెట్లు



పూనూరు మైనర్‌లో పడిపోయిన రక్షణ గోడ



అడవిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

టీడీపీతోనే మహిళల సంక్షేమం, రక్షణ

ఇంటింటి ప్రచారంలో యువనేత హర్షవర్ధన్

సంతమాగులూరు, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో మహిళల సంక్షేమం, రక్షణ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. మండలంలోని అడవిపాలెం గ్రామంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి తండ్రి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం చేపట్టారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సూపర్‌సిక్స్ పథకాలను రూపొందించిందన్నారు. తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ప్రతి ఏటా రూ.15వేలు అందిస్తుందన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందిస్తుందన్నారు. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20లక్షల మంది యువతకు ఉపాధి. నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ.3 వేలు జీవన భృతి కింద అందిస్తామన్నారు. రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. టీడీపీ మేనిఫెస్టోతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గాడిపర్తి వెంకట్రావు, తేలప్రోలు రమేష్, చల్లా కృష్ణ, గుండపునేని సురేష్, గుండపునేని సత్యం, చింతా శ్రీదర్, గమిడి కోటేశ్వరరావు, వసంత వేణుబాబు, గురుయాదవ్, చేవూరి వాసిరెడ్డి, అట్లా పెదవెంకటరెడ్డి, దుద్దేల గాలియ్య, నక్కా పెదగాలియ్య నాగబోతు సుజాత, దిండు హనుమంతరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 : పలు గ్రామాల్లో మంగళవారం ఎస్‌ఐ సురేష్ కేంద్ర ప్రత్యేక బలగాలతో కలసి కవాతు నిర్వహించారు. సిలోన్ కాలనీ, జీవరక్షానగర్, అనుమల్లిపేట, రామనగర్, చిన్నబజార్‌లలో కవాతు నిర్వహించారు. చెడు ప్రవర్తన కలిగిన వారికి ఇళ్ల వద్దనే కౌన్సెలింగ్ ఇచ్చారు. దేశాయిపేటలో పెట్రోలింగ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఆయా సందర్భాల్లో ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రజలు సహకరించాలన్నారు.

పెదగంజాంలో

చినగంజాం, ఏప్రిల్ 9 : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదగంజాం, పల్లెపాలెం, కాటంవారిపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం తదితర గ్రామాల్లో పోలీసులు, బీఎస్‌ఎఫ్ దళాలు మంగళవారం మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. ఎన్నికల్లో ప్రజలు వివాదాలకు తావు లేకుండా అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పంగులూరు, ఏప్రిల్ 9 : స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ తిరుపతిరావు అన్నారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరుతూ మండలంలోని అలవలపాడు, తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో మంగళవారం రాత్రి సెంట్రల్ బోర్డు సెక్యూరిటీ ఫోర్సుతో కవాతు నిర్వహించారు. ఓటుహక్కు ఉన్న ప్రతివ్యక్తి స్వేచ్ఛగా తన ఓటును వినియోగించుకోవాలని కోరారు. రౌడీషీటర్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

14న పర్చూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, ఏప్రిల్ 9: పర్చూరులోని ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 14న శంకర్ కంటి అసుపత్రి పెదకాకాని, చిన్మయా మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాబోలు ఉదయ్‌భాస్కర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. విద్యాదాత స్వర్గీయ పాబోలు రాధాకృష్ణమూర్తి, ఇందిరాదేవి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

» అమెరికా రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

» కడచూపునకు తరలి వచ్చిన ప్రజానీకం



రేవంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

బోడవాడ(పర్చూరు), ఏప్రిల్ 9: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అచంట రేవంత్ మృతదేహానికి స్వగ్రామం బోడవాడలో అశ్రు నయనాల మధ్య మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన అచంట రఘ కుమారుడు రేవంత్ (24) ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికా వెళ్లాడు. స్నేహితులతో కలసి ఆలయానికి కారులో వెళుతూ ప్రమాదానికి గురై ఈనెల 2న మృతి చెందిన విషయం తెలిసిందే. వారం రోజుల తరువాత మృతదేహం స్వగ్రామం చేరుకోడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. చేతికి అందొచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ఇలా విదేశాల్లో మృతి చెందడతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రేవంత్ అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందించారు. ఈ ఘటన చీరాల, వేటపాలెం మధ్య 216 జాతీయ రహదారిలో మంగళవారం జరిగింది. అందిన సమాచారం మేరకు కొణిజేటి చేనేతపురికి చెందిన కొందరు మహిళలు కూలి పనులకు ఆటోలో వెళ్తున్నారు. అందులో కొందరు ఆటో కడ్డీపై కూర్చున్నారు. ఈ క్రమంలో ఆటో ఎద్దులబండి పక్కగా వెళుతున్న సమయంలో బండికి ఉన్న ఇనుపరేకు నసీమ(40) పొట్టను చీల్చింది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. మరో మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీ మహిళలు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

చినగంజాం, ఏప్రిల్ 9 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మహిళలు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు అన్నారు. ఉగాది సందర్భంగా రంగారావు మెడికల్ షాపు వద్ద వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారభించారు. వాసవీ వనితా క్లబ్ సభ్యులు మోటుమర్రి రాజ్యలక్ష్మి, వలివేటి రాణి సహాయ సహకారాలతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ మండల అధ్యక్షులు కోట సుచిత్ర తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రం వద్ద మజ్జిగ, మంచినీరు నిరంతరాయముగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ పొట్టి శైలజ. క్లబ్ మండల కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి మోటుమర్రి శేషకుమారి, నాగజ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

మాజీ మంత్రి జేడీ శీలం



మాట్లాడుతున్న జేడీ శీలం

పర్చూరు, ఏప్రిల్ 9 : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. మంగళవారం అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగొర్ల శివశ్రీ లక్ష్మీ జ్యోతి హాజరయ్యారు. ఆమెను జేడీ శీలం నాయకులకు పరిచయం చేశారు. జేడీ మాట్లాడుతూ దేశం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామన్నారు. అనంతరం జోతి మాట్లాడుతూ ఈనెల 11న కార్యకర్తల సమావేశం అనంతరం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట శివనాగేశ్వరరావు, పోతిన సంతప్, రమరాజు యాదవ్, జానకి రామయ్య, పులిపాటి రవి, రహీం అబ్దుల్, సూర్యబాబు, నాగిరెడ్డి, మౌలాలి, అంబేద్కర్, బాషా, రాంబాబు, మక్కెన సురష్, జయరాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

అద్దంకి : ఆంధ్రాకు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి, బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. సంజీవనగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం జేడీ, పార్టీ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్ ప్రారంభించారు. ముందుగా బంగ్లా రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా కార్యాలయానికి చేరుకున్నారు. జేడీ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఏపీ వాణి బలంగా వినిపించడానికి, బాపట్ల పార్లమెంట్ సమస్యల పరిష్కారం కోసం ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలన్నారు. అడుసుమల్లి కిషోర్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ ప్రజలకు గుంటూరులోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో 50 శాతం రాయితీతో వైద్య సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరే సురేంద్ర, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నదానం

అద్దంకి, ఏప్రిల్ 9 : అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతినెలా అమవాస్య రోజు దేసు ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాసరావు సహకారంతో పేదలకు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్, వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

నేడు కొత్తూరులో బాబీ ఎన్నికల ప్రచారం

బల్లికురవ, ఏప్రిల్ 9 : మండలంలోని కొత్తూరు గ్రామంలో అద్దంకి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా యువనేత గొట్టిపాటి కమల్ కిషోర్ (బాబీ) నేడు బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొనాలని మండల నేతలు కోరారు.





గొర్రెపాడులో మహిళలతో మాట్లాడుతున్న కమల్‌కిషోర్ (బాబీ ఫైల్) చవిటిపాలెంలో అవ్వను ఆప్యాయంగా పలుకరిస్తున్న హర్షవర్ధన్ (ఫైల్)

ప్రచారంలో ముచ్చటగా మూడో తరం

» దూసుకుపోతున్న గొట్టిపాటి కుటుంబ సభ్యులు

» ఆకట్టుకుంటున్న యువ నేతల ప్రసంగాలు

అద్దంకి, ఏప్రిల్ 9 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ విన్నా గొట్టిపాటి కుటుంబం గురించే చర్చ సాగుతోంది. గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికే వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఐదో సారి అద్దంకి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. ఇక దర్శి నియోజకవర్గం లో టీడీపీ అభ్యర్థిగా అనూహ్యంగా దివంగత మంత్రి గొట్టిపాటి హనుమంతరావు మనవరాలు, దివంగత ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య కుమార్తె లక్ష్మి పోటీలో నిలిచారు. దీంతో గొట్టిపాటి కుటుంబం వారు రెండు నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్నారు. అదే సమయంలో దర్శి నియోజవర్గ ప్రచారంలో కూడా గొట్టిపాటి లక్ష్మి జోరు పెంచారు. అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా పెద్ద కుమారుడు హర్షవర్ధన్‌తో పాటు స్వర్గీయ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు చిన్నకుమారుడు స్వర్గీయ గొట్టిపాటి కిషోర్ కుమారుడు గొట్టిపాటి కమల్‌కిషోర్(బాబీ)లు గతవారం రోజులుగా గ్రామాలలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గొట్టిపాటి రవికుమార్ చిన్న కుమారుడు మహేష్‌బాబు అమెరికా నుండి వచ్చిన వెంటనే ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఇలా గొట్టిపాటి హనుమంతరావు ఒక్కరే రాజకీయంలో ఉండగా హనుమంతరావు మృతి తరువాత కుమారుడు నరసింహారావు(నర్సయ్య) రాజకీయ ప్రవేశం చేయగా, ఆ తరువాత సోదరుని కుమారుడు గొట్టిపాటి రవికుమార్ రాజకీయాలలో అడుగుపెట్టి గత రెండు దశాబ్దాలుగా తిరుగులేని నేతగా ముందుకు సాగుతున్నారు. ఇక మూడో తరంలో నర్సయ్య కుమారుడు భరత్ దశాబ్ద కాలం క్రితమే పర్చూరు నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. ప్రస్తుతం క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నాయి. అనూహ్యంగా నర్సయ్య కుమార్తె లక్ష్మి దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. అదే సమయంలో నర్సయ్య సోదరుడి కుమారుడు కమల్ కిషోర్(బాబీ) గత ఎన్నికల సమయం నుచే బాబాయ్ రవికుమార్ కోసం ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇక రవికుమార్ పెద్ద కుమారుడు గత ఎన్నికల సమయంలో అక్కడక్కడా మాత్రమే ప్రచారం చేయగా ఈసారి ఇద్దరు యువనేతలు నియోజకవర్గంలో పోటీపడి ప్రచారం చేస్తున్నారు. ఇలా గొట్టిపాటి కుటుంబం నుంచి మూడో తరం యువనేతలు ప్రస్తుత ఎన్నికలలో ఎన్నికల ప్రచారంలో పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యారు. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, బల్లికురవ మండలాల ప్రజలు గొట్టిపాటి కుటుంబంలో మూడో తరం నేతలను చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు. కొందరు వృద్ధులైతే హనుమంతరావు, నర్సయ్య, రవికుమార్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని యువ నేతలకు చెప్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో యువనేతల ప్రచారానికి విశేష స్పందన వస్తోంది. ఇంటింటికీ తిరిగి అందరినీ పలుకరిస్తూ ప్రచారం నిర్వహిస్తుండడంలో గొట్టిపాటికి భారీ మెజార్టీ వచ్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి.

అన్ని వర్గాలను నిండా ముంచిన వైసీపీ

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. చాయ్ విత్ హర్షవర్ధన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం అద్దంకి పట్టణం లోని భవానిసెంటర్, శింగరకొండ రోడ్డు, దర్శి రోడ్డులలో టీ దుకాణాలు, చికెన్ సెంటర్‌లు, ఇతర వ్యాపార సంస్థల వద్ద వ్యాపారులు, స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ముస్లిం, ఎస్సీ వర్గాల దుకాణాదారులు తమ సమస్యలను హర్షవర్ధన్ కు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయటం జరుగుతుందన్నారు. అద్దంకి పట్టణంలో తన తండ్రి గొట్టిపాటి రవికుమార్ చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, కోనేటి అనిల్, వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, ముస్లిం నేతలుషేక్ మాబు, అహ్మద్, కాశీం, కరి ముల్లా,మోహిద్దీన్, మదీనా, రసూల్, బీసీ నేతలు యద్రాకుల రామాంజనేయులు, కాసా పుల్లయ్య, తుంగా రాము, కడియం శ్రీను, కుంచాల రామాంజనేయులు, ఎస్సీ సెల్ నేతలు స్టాలిన్, మున్నంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

విజయం మనదే.. వీరోచితంగా అడుగులు వేయండి

కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 9 : విజయం మనదే. వీరోచితంగా అడుగులు వేయండని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఆయా పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కావూరిపాలెంకు చెందిన 20 కుటుంబాలవారు కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారి మెడలో పార్టీ కండువాలువేసి కొండయ్య వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయం. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారు. అందరి సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. అనంతరం చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, బాపట్ల పార్లమెంట్ లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ అనిల్‌కుమార్, పలువురు న్యాయవాదులు కొండయ్యను కలసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌వీ (నాన్‌రెసిడెన్షియల్ ఓటర్స్) గూగుల్ ఫాంలో రిజిస్టర్ అయ్యేందుకు కార్యాచరణను ప్రతినిధులకు చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కొండయ్య

జయహో బీసీ నినాదం మారుమోగాలి

వీధివీధినా.. అడుగడుగునా చీరాల నియోజకవర్గంలో బీసీ నినాదం మారుమోగాలని అభ్యర్థి కొండయ్య శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ శివారు సావరపాలెంలో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను యన వివరించారు. బీసీలకు తెచ్చే ప్రత్యేక చట్టాలపై అవగాహన కల్పించారు. టీడీపీతోనే బీసీలకు భరోసా అన్నది పేద బీసీలకు చెప్పాలన్నారు. అనంతరం చంద్రమౌళి కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చైతన్యవంతంగా ఆలోచించి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. తోటవారిపాలెం పంచాయతీ పరిధి దండే కాలనీలో నిర్వహించిన యానాదుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్డీవో నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా పంచాంగ శ్రవణం

టీడీపీ కార్యాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వేదపండితులు శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని కూటమి అభ్యర్థి కొండయ్య ఆధ్వర్యం లో నిర్వహించారు. కొండయ్య, ఆయన కుమారులు గౌరీఅమర్‌నాథ్, మహేంద్రనాథ్, ఆయా పార్టీల శ్రేణులు పూజల్లో పాల్గొన్నారు. పేరు బలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందు కు హాజరైన ప్రతి ఒక్కరు ఆసక్తి చూపారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శింగరకొండ ఆంజనేయ స్వామి, వాసవీమాత

ఆనందంగా ఉగాది

అద్దంకి, ఏ ప్రిల్ 9 : అద్దంకి, ఏప్రిల్ 9 : తెలుగు సంవత్సరాది ఉగాదిని మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకున్నారు. ఉగాది పచ్చడి తయారు చేసి పంచిపెట్టారు. ఆలయా ల్లో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పలు దేవాలయాలకు వెళ్లి స్వామి వార్లను దర్శించుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా సుబ్బరాయ శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం ఏ ర్పాటు చేశారు. అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం, కన్యకాపరమేశ్వరి అమ్మ వారి దేవాలయం, ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంతో పాటు మి గతా ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరుగగా భక్తులు ఆసక్తిగా విన్నారు.

చినగంజాం : తెలుగు సంవత్సరాది వేడుకలను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఆనందంగా నిర్వహించారు. క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దీంతో భక్తులతో కిటకిటలాడాయి. షడ్రుచుల ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం పంచాగ శ్రవణాన్ని వేద పండితులు చదవి వినిపించారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఏఎల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శత అష్టోత్తర కలశ స్థాపన, తిరువంజనం కార్యక్రమాన్ని నిర్వహించి, 108 కలశాలతో స్వామికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని మహిళలు చేశారు. రాత్రికి స్వామి వారిని విశేషంగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. మండలంలోని సంతరావూరు, చినగంజాం, గొనసపూడి, కడవకుదురు, రాజుబంగారుపాలెం, చింతగుంపల్లి, పెదగంజాం, నీలాయిపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పంచాగ శ్రవణం నిర్వహించారు.

బల్లికురవ : హిందువులు తొలి పండగగా భావించే ఉగాది పండగను మంగలవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతనం వస్త్రాలు ధరించి, ఇంటికి మామిడి తోరణాలను కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి పండగ కావడంతో ప్రజలు ఆలయాలకు వెళ్లి వినాయకునికి పూజలు చేశారు. అనంతరం నూతన పనులను ప్రారంభించారు. వ్యాపారులు కొత్త దస్త్రాలను ప్రారంభించారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. గుంటుపల్లి శివాలయంలో వేద పండితులు గుడిమెళ్ల పవన్‌కుమార్, పేటేటి లక్ష్మయ్య పంచాంగ శ్రవణం చెప్పడంతో ప్రజలు కార్యక్రమంలో పాల్గొని తమ పేరు బలాలు ఎలా ఉన్నాయి తెలుసుకున్నారు. రైతులు పంటలు ఎలా పండుతాయో తెలుసుకున్నారు. పలు గ్రామాలలో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు.

పంగులూరు : మండలంలో మంగళవారం ఉగాది పండుగను ప్రజలు భక్తితో నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. చందలూరు శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ప్రముఖ పండితులు, హిందూ కళాశాల ఆంధ్రోపన్యాసకులు నందనవనం శ్రీనివాసరావు తెలుగు సంవత్సరాది ప్రాధాన్యతను, క్రోధి నామ సంవత్సరంలో రాశి ఫల విశ్లేషణతో పాటు పంటల పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రఘునాథాచార్యులు, పలువురు రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బల్లికురవలో పంచాంగ శ్రవణం వింటున్న గ్రామస్థులు